సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



న్యూస్‌రీల్

భారీ వర్షం



హుకుంపేటలో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రోజూ వర్షాలు కురుస్తున్నాయి.సోమవారం ఉదయం 8గంటల వరకు పొగమంచు పరుచుకుంది.మధ్యాహ్నం 2గంటల వరకు అధిక ఎండతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.సాయంత్రం నాలుగు గంటల నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.పాడేరుతో పాటు సమీప గ్రామాలలో గంట పాటు భారీ వర్షం కురిసింది.

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టం,గత్తుం,రాప,సంతారి,రంగశీల,అడ్డుమండ,శోభకోట,మట్టుజోరు,మఠం,పాతకోట,కొట్నాపల్లి పంచాయతీల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తెల్లరాయి తరలిస్తున్న లారీ సీజ్

చింతూరు: మండలంలోని గొడ్లగూడెం నుంచి తెల్లరాయిని తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు చింతూరు సీఐ అప్పలనాయుడు సోమవారం తెలిపారు.

తెల్లరాయి రవాణాకు సంబంధించిన పత్రాల విషయంలో అనుమానంగా ఉండడంతో లారీని సీజ్ చేశామని ఆయన తెలిపారు. పత్రాలను పరిశీలించేందుకు మైనింగ్ అధికారులకు సమాచారమిచ్చినట్టు సీఐ తెలిపారు. కాగా లారీని సీజ్ చేసిన విషయంపై చింతూరు సీఐ తమకు సమాచారమిచ్చారని, పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి ఏమైనా తేడాలుంటే అపరాధ రుసుం విధిస్తామని రాజమహేంద్రవరం మైనింగ్ ఏడీఈ విష్ణువర్ధన్ తెలిపారు.

ఆరుగురు సీఐల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో ఆరుగురు సీఐలు బదిలీ అయ్యారు. రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న బాసిన భాస్కరరావు, శ్రీకాకుళం డీఎస్‌బీలో పనిచేస్తున్న మారాదాన శ్రీనివాసరావును విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌కి అటాచ్ చేశారు. విజయనగరం డీఎస్‌బీలో పనిచేస్తున్న సీహెచ్ రుద్రశేఖర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు సర్కిల్ సీఐగా, అక్కడ పనిచేస్తున్న జి.దేముడు బాబుని విశాఖ రేంజ్ వీఆర్‌కి, విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఈ.నరసింహమూర్తిని విజయనగరం డీఎస్‌డీ-2కి, వీఆర్‌లో ఉన్న ఎం.వెంకట గణేష్‌ని శ్రీకాకుళం డీఎస్‌బీకి బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'స్పందన'కు 30 అర్జీలు



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో 30 అర్జీలు స్వీకరించినట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఐటీడీఏ ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి సబ్ కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సంబంధించిన, వ్యక్తిగత అర్జీలు స్వీకరించి, కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించినట్టు చెప్పారు. మరికొన్ని అర్జీలను పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు పంపినట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. 2004 నిబంధనలు ప్రకారం భూపతి పాలెం ప్రాజెక్ట్ ముంపు బాధితులైన 30 కుటుంబాలకు 60 ఎకరాల భూమిని ఏర్పాటు చేయాలని, అడ్డతీగల మండలం కోనలవ గ్రామంలో సుమారు 40 మంది గిరిజనులకు అటవీ హక్కు చట్టం ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని ఆయా గ్రామస్తులు కోరినట్టు సబ్‌కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు మరికొందరు అర్జీలు అందజేసినట్టు చెప్పారు.

కిడ్నీ రోగులకు కొండంత అండ

కిడ్నీ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. చింతూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తోంది. కాకినాడ, రాజమహేంద్రవరం, రంపచోడవరాలలో ఆస్పత్రులకు పరుగులు తీసి చికిత్స చేసుకోవలసిన బాధ నుంచి ఊరట కలిగించింది.

- నిరంతరం డయాలసిస్ సేవలందిస్తున్న చింతూరు కేంద్రం
- నాలుగు రాష్ట్రాల ప్రజలకు చికిత్స
- రూ 10 వేలు పింఛను అందిస్తున్న ప్రభుత్వం

చింతూరు: మూత్ర పిండాల రోగులకు డయాలసిస్ ప్రక్రియ ప్రాణవాయువు లాంటిది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో కొన్ని అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం రోగులకు ఒయాసిస్‌లా ఉపయోగపడుతోంది. 2016లో వీఆర్‌పురం మండలం అన్నవరంలో కాళ్లవాపు వ్యాధి ప్రారంభమైంది. చింతూరు, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో ఈ వ్యాధితో 2016 నుంచి 2020 మే వరకు 38 మంది చనిపోయారు. కాగా అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.దీనిలో భాగంగా 2016 డిసెంబరు 8న ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఆయన చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో కాళ్లవాపు వ్యాధితో మృతిచెందిన కుటుంబాలను ఇంటింటికి వెళ్లి పరామర్శించి ఎవరూ అధైర్య పడవద్దని, అందరికీ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కాగా 2020లో మరోమారు కాళ్లవాపు విజృంభించడంతో స్పందించిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబాలకు రూ 5 లక్షల చొప్పున పరిహారం అందించారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటు

కాళ్లవాపు మరణాలు కిడ్నీ వ్యాధి కారణంగానే అని నిర్ధారణకు వచ్చిన ప్రభుత్వం దాని నివారణకు 2020 అక్టోబరు 12న చింతూరు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసింది. అప్పటివరకు డయాలసిస్ కోసం కాకినాడ, రాజమహేంద్రవరం, రంపచోడవరం వెళ్లాల్సిన రోగులకు చింతూరులోనే కేంద్రం ఏర్పాటు చేయడంతో దూరాభారంతో పాటు ఆర్థికభారం తగ్గింది. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో చింతూరు డివిజన్లోని నాలుగు మండలాల్లో కాళ్లవాపు మరణాలు కూడా తగ్గుముఖం పట్టాయి.



చింతూరు కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ రోగులు

నిరంతరంగా సేవలు

చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలతో పాటు పొరుగునే ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణాకు చెందిన రోగులకు కూడా ఇక్కడ సేవలు అందుతున్నాయి. ఇప్పటివరకు ఈ కేంద్రంలో 118 మంది పేషెంట్లుగా నమోదవగా 8,626 సార్లు డయాలసిస్ నిర్వహించారు. ప్రస్తుతం 40 యాక్టివ్ కేసులుండగా ప్రతిరోజూ షిఫ్టుల వారీగా 15 మందికి ఇక్కడ డయాలసిస్ నిర్వహిస్తున్నారు. సమీపంలోని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రమున్నా స్థానిక ఆధార్‌కార్డు ఉన్నవారికి మాత్రమే అక్కడ డయాలసిస్ చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల వారికి చేయడంలేదని రోగులు అంటున్నారు. ఆంధ్రా ప్రభుత్వం మాత్రం ఇతర రాష్ట్రాలకు చెందిన కిడ్నీ రోగులకు సైతం డయాలసిస్ సేవలు అందిస్తోందని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రోగులు తెలిపారు. దీంతోపాటు కిడ్నీ రోగులకు ప్రభుత్వం నెలకు రూ.10 వేలు పింఛను అందిస్తోంది. ప్రస్తుతం ఇక్కడి 30 మంది రోగులు ప్రభుత్వ పింఛనును పొందుతున్నారు. ఈ కేంద్రంలో ప్రతి రోగికి వారం రోజుల షెడ్యూల్ ఖరారు చేసి, ఒక్కో రోగికి రోజుకు 4 గంటల చొప్పున వారానికి రెండు, మూడు పర్యాయాలు డయాలసిస్ చేస్తున్నారు.

సమీపంలోనే వైద్యం



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నేను నాలుగు నెలలుగా ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్నాను. దూరం వెళ్లకుండా మా గ్రామానికి సమీపంలోనే వైద్యం అందడం సంతోషంగా ఉంది.

– బుడుగుల సావిత్రి, పోలిపాక, కూనవరం మండలం

ఆంధ్రాలో పింఛను ఇస్తున్నారు



వృత్తిరీత్యా తెలంగాణలోని పాల్వంచలో స్థిరపడ్డాను. కిడ్నీవ్యాధి రావడంతో గతంలో ఖమ్మంలో డయాలసిస్ చేయించుకున్నాను. నాకు ఆంధ్రా ఆధార్‌కార్డ్ ఉండడంతో భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స చేయనన్నారు. దీంతో చింతూరులో డయాలసిస్ చేయించుకుంటున్నాను. తెలంగాణాలో నాకు ఎలాంటి పింఛను ఇవ్వలేదు. ఆంధ్రా ప్రభుత్వం మాత్రం నెలకు రూ.10 వేలు పింఛను ఇస్తోంది.

– మాలోతు రమేష్, లింగాలపల్లి, ఎటపాక మండలం

కేసుల సంఖ్య పెరిగింది

ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణంలో కిడ్నీ రోగులకు డయాలసిస్ జరుగుతోంది. గతంలో నెలకు 100 నుంచి 150 సార్లు డయాలసిస్ చేసేవాళ్లం. ప్రస్తుతం కేసుల సంఖ్య పెరగడంతో 350 నుంచి 400 సార్లు చేస్తున్నాం.

– ఉమామహేష్, డయాలసిస్ కేంద్రం మేనేజర్

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు పదిమంది



పతకాలు సాధించిన ఆనందంలో కుస్తీ అకాడమీ విద్యార్థులు

కొయ్యూరు: ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో ఈనెల 16 నుంచి 18 వరకు జరగనున్న జాతీయస్థాయి కుస్తీ పోటీలకు కొయ్యూరు కుస్తీ అకాడమీకి చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు చిత్తూరు డీఎస్ఏ స్టేడియంలో భారతీయ కుస్తీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ ,సబ్‌జూనియర్ కుస్తీ పోటీల్లో ఈ అకాడమీ నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పది బంగారు, రెండు వెండి, మూడు బ్రాంజ్ పతకాలను సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఎం.రమణబాబు, వి.మహేష్, సీహెచ్.మహేష్, కె.దేవమ్మ, కె.రాణి, ఎం.రూప, నిర్మల, వి.ప్రసాద్,పి.బుజ్జిబాబు, జి.అశోక్, బంగారు పతకాలు సాధించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పి.రమేష్, కె.దావీద్‌లు వెండి పతాకాలు, ఎస్.మోహన్, హరిశ్చంద్ర, కె.నిర్మల బ్రాంజ్ పతకాలను సాధించారు. పీడీ అంబటి నూకరాజు మాట్లాడుతూ పాల్గొన్న 15 మంది పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ స్థాయి పోటీలలోనూ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఐటీడీఏ పీవో అభిషేక్,డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

భూ హక్కు భూరక్షకు అధిక ప్రాధాన్యం



రెవెన్యూ యంత్రాంగంతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

- రీసర్వే లక్ష్యాలను అధిగమించాలి
- డీ ఫారం పట్టాల పంపిణీకి సన్నద్ధం
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్షకు జిల్లాలోని రెవెన్యూ యంత్రాంగం అధిక ప్రాధాన్యం ఇచ్చి భూముల రీసర్వే లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. భూముల రీసర్వే,డీ ఫారం పట్టాల పంపిణీ,పీవీటీజీ ఓటర్ల నమోదు ప్రక్రియపై సోమవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ యంత్రాంగంతో వీడియో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన రైతులకు డీఫారం పట్టాల పంపిణీకి రెవెన్యూ అధికారులు సన్నద్ధం కావాలన్నారు. గిరిజనులు డీఫారం పట్టాల కోసం వీఆర్వోలు,తహసీల్దార్‌లను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. ఎస్సైన్‌మెంట్ కమిటీ సమావేశం ఏ సమయంలోనైనా జరగవచ్చని,ఆ కమిటీ ప్రశ్నలకు తహసీల్దార్‌లు సమాధానాలు చెప్పాలన్నారు.గిరిజనులకు మాత్రమే డీఫారం పట్టాలు పంపిణీ చేయాలన్నారు.డీఫారం పట్టా భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తే రైతు భరోసాతో పాటు,పంటల రాయితీలు పొందేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. భూముల రీసర్వేలో సబ్‌డివిజన్ పెండింగ్ ఉండకూడదని, మే 10వతేదీ నాటికి మ్యూటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. అర్హులైన పీవీటీజీలకు ఓటరు గుర్తింపు కార్డులు ఉండాలని,ఎంపీడీవోల నుంచి ఫారం-7 పత్రాలను సేకరించి,రానున్న పది రోజుల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి,పీవీటీజీల ఓటరు నమోదు పక్కాగా జరపాలన్నారు. జిల్లాలో ఆదాయ ధృవీకరణ పత్రాలు,అడంగల్ పత్రాలు,ఫ్యామిలీ ధృవపత్రాలు జారీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ శివశ్రీనివాస్,సబ్‌కలెక్టర్ అభిషేక్,డీఆర్వో అంబేడ్కర్,ల్యాండ్ సర్వే ఏడీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పనిదినాలు : జిల్లాలో జాబ్‌కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పాటు ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఉపాధి,నాడు-నేడు పనులపై అధికారులతో సోమవారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు నిర్మూలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో పండ్ల, ఇతర తోటలు పెంపకానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి సంబంధించి రూ.22కోట్లు ఆయా పాఠశాలల ఖాతాల్లో ఉన్నాయని, అత్యవసర పనులను గుర్తించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.15రోజుల్లో చింతూరు ప్రాంతంలో పర్యటిస్తానని, నాడు-నేడు పనులు ప్రారంభించకపోతే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. నిర్మాణ పనులు నాణ్యతగా జరగాలన్నారు.ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనిచేయని పక్షంలో సంబంధిత జేఈలపై చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు.స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. డ్వామా పీడీ రమేష్‌రామన్,గిరిజన సంక్షేమశాఖ ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు,వేణుగోపాల్,ఉపాధి హామీ పథకం ఏపీడీ గిరిబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే ధ్యేయం



మేడువాయి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని రుచి చూస్తున్న చైర్మన్ ప్రతాప్ రెడ్డి

- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

వీఆర్‌పురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందించి, వారికి సంపూర్ణ ఆరోగ్యం కలిగేలా కార్యకర్తలు పని చేయాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజుపేటగొమ్ము అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. కేంద్రంలో ఫ్యాన్ లేకపోవడాన్ని గమనించి సిబ్బందిని ఆరా తీశారు. కొత్త ఫ్యాన్ కొనుగోలు చేసేందుకు రూ.2 వేల నగదును ఆయన అందజేశారు. అనంతరం గర్భిణులకు నిర్వహించే సీమంతం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.అదే గ్రామంలోని మరో కేంద్రాన్ని సందర్శించారు. ఆ కేంద్రంలో కూడా ఫ్యాన్ లేకపోవడంతో ఫ్యాన్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రేఖపల్లి కేజీబీవీని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, తహసీల్దార్ ఎన్.శ్రీధర్ ,సీడీపీవో విమల పాల్గొన్నారు.

ఎటపాక: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి సోమవారం మండలంలో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు.ఎటపాక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం,బాలికల గురుకుల విద్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, మేడువాయిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం,చింతలగూడెం అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.నందిగామ హైస్కూల్లో ఆహారపదార్థాలను రుచిచూసి, శాంపిల్స్‌ను సేకరించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్,ఏఎస్‌వో శ్రీహరి,తహసీల్దార్ వేణుగోపాల్,ఎంపీడీవో విఠల్‌పాల్,ఎంఈవో బాలరాజు తదితరులున్నారు.

కూనవరం: మండలంలోని కూనవరం కేంద్రంలో చౌక దుకాణాన్ని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ చేశారు. బెస్త బజార్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి, అంగన్‌వాడీ కార్యకర్త పి.వరలక్ష్మిని పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేసి, అభినందించి శాలువాతో సన్మానించారు. అద్దెభవనంలో ఉన్న ఈ కేంద్రానికి సొంతభవనం సమకూర్చేందుకు స్థలసేకరణ చేయాలని స్థానిక తహసీల్దార్ కె.అనసూయను ఆదేశించారు. మండలంలో పది అంగన్‌వాడీ భవనాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అనంతరం కోతులగుట్టలో కేజీబీవీ పాఠశాలను తనిఖీచేశారు.డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్, అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ శ్రీహరి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ బిగణేష్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, తహసీల్దార్ అనసూయ, సీడీపీవో విమల పాల్గొన్నారు.

జీసీసీ గొడౌను ఇన్‌చార్జిపై ఆగ్రహం



చింతూరులో బియ్యం తూకం వేయిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

చింతూరు: బియ్యం తూకాల్లో తేడాలుండడంతో స్థానిక జీసీసీ గొడౌను ఇన్‌చార్జిపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక జీసీసీ గొడౌనును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొడౌన్‌లోని స్టాకును పరిశీలించిన ఆయన 50 కిలోల బియ్యం బస్తాలను తూకం వేయించారు. 50 కిలోల కంటే తక్కువగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ కాటా నిర్వహణ కూడా సరిగా లేకపోవడంపై కూడా ఆయన అసహనం వ్యక్తం చేశారు. తూకాల్లో తేడాలున్నా పట్టించుకోని గొడౌను ఇన్‌చార్జిపై చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయి డివిజన్ మేనేజర్ గణేష్‌ను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక నర్సింహపురం గిరిజన బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాల, లక్కవరంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో సుజాత, సివిల్ సప్లయి డీఎస్‌వో శివప్రసాద్, డీఎం భాస్కరరావు, మేనేజర్ రాజేశ్వరరావు, తహసీల్దార్ సాయికృష్ణ పాల్గొన్నారు.

విషమ 'పరీక్ష'



సంఘటన స్థలంలో బైక్‌తో సహా నుజ్జయిన గణపతి మృతదేహం (ఇన్‌సెట్) గణపతి (ఫైల్)



- బైకును ఢీకొట్టిన లారీ.. ఇద్దరు మృతి
- మరదలిని పరీక్షకు తీసుకువచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం
- ప్రాణాలు కోల్పోయిన బావ, బావమరిది
- అపస్మారకస్థితిలో యువతి



చికిత్స పొందుతున్న చెల్లమ్మ



చికిత్స పొందుతూ మృతి చెందిన కిరణ్

మాకవరపాలెం/పాయకరావుపేట/చింతపల్లి: మరదలి పరీక్ష కోసం చింతపల్లి నుంచి విశాఖ వచ్చి తిరిగి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ, అతని బావమరిది (యువతి సోదరుడు) ప్రాణాలు కోల్పోయారు. బాధితురాలు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతోంది. మాకవరపాలెం మండలంలోని చంద్రయ్యపాలెం జంక్షన్ సమీపంలో సోమవారం ఈ ఘోరం జరిగింది. పోలీసులు, బాధితుల బంధువులు అందించిన వివరాల ప్రకారం.. పాయకరావుపేట మండలం పి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంచె గణపతి (23) పాడేరు ఏజెన్సీలో గృహనిర్మాణ పనులు చేస్తుంటాడు. గిరిజన యువతిని పెళ్లి చేసుకొని చింతపల్లిలో స్థిరపడ్డాడు. భార్య చెల్లెలు వంతల చెల్లమ్మ (18)కు సోమవారం విశాఖలో నర్సింగ్ పరీక్ష ఉండడంతో గణపతి, చెల్లమ్మ, ఆమె సోదరుడు వంతల కిరణ్ (20) మోటార్ సైకిల్‌పై నగరానికి వచ్చారు. పరీక్ష పూర్తయ్యాక చింతపల్లి తిరిగి వెళుతుండగా చంద్రయ్యపాలెం జంక్షన్ దాటగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న గణపతిపై నుంచి లారీ దూసుకువెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కిరణ్, చెల్లమ్మలు అపస్మారక స్థితికి చేరుకోవడంతో 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిరణ్ మరణించాడు. చెల్లమ్మను ఉన్నత చికిత్స కోసం విశాఖ తరలించారు. సంఘటన స్థలాన్ని నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మృతుల స్వగ్రామాల్లో విషాదం

పాయకరావుపేట మండలంలో పి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంచె గణపతి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గణపతికి తండ్రి లేడు. తల్లి స్వగ్రామంలో నివసిస్తోంది.

భవన నిర్మాణ పనులు చేసుకుంటూ ఏజెన్సీలో ఉంటున్న కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న అతని తల్లి తల్లడిల్లిపోయింది. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. గణపతి వివాహం చేసుకున్న యువతి స్వగ్రామం చింతపల్లి మండలం కొమ్మంగి పంచాయతీ శివారు మల్లవరం. రోడ్డు ప్రమాదంలో గణపతితోపాటు మల్లవరానికి చెందిన అతని బావమరిది వంతల కిరణ్ కూడా మృతి చెందడంతో గ్రామం చిన్నబోయింది. అంత చిన్న వయసులో ఎంత పెద్ద కష్టమొచ్చిందని ఊరంతా కన్నీరు పెట్టుకుంది.

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- జగనన్నే మా భవిష్యత్-మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహణ



స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీలో సోమవారం జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోయలగూడెం, సీతారాంపురం,రోలంగి, గంగుల గ్రామాల్లో 275 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు,పచ్చ మీడియా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. ఎవరు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని తెలిపారు. అమ్మ ఒడి, రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, నాడు- నేడు, సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్లు వంటివి దేశానికే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం ఎనలేని సేవలందించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషా దేవి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత,ఎర్రబొమ్మల సర్పంచ్ పండన్న,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, గణబాబు తదితరులు పాల్గొన్నారు.

12,13 తేదీలలో బొకారో ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఖరగ్‌పూర్ డివిజన్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన ప్రజా ఆందోళనల నేపథ్యంలో పలు రైళ్లు ఆలస్యంగా నడవడం, తిరుగు ప్రయాణానికి కావలసిన రేక్‌ల రోజుల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ధన్‌బాద్‌లో ఈ నెల 12,13 తేదీలలో బయల్దేరే ధన్‌బాద్-అలప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

విశాఖపట్నం-తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం-తిరుపతి(08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం 8.20 గంటలకు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. భగత్‌కి కోటి నుంచి విశాఖ రావలసిన లింక్ రైలు సుమారు 13గంటలు ఆలస్యంగా నడుస్తుందన్నందున రీషెడ్యూల్ చేసినట్లు తెలిపారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

రావికమతం : కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి అయిదుగురు నిర్వాహకులను అరెస్ట్ చేశామని కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. కొంజుర్తి గ్రామంలో పెద్ద ఎత్తున పందాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో సోమవారం దాడి చేశామన్నారు. పందాలు నిర్వహిస్తున్న రమణాజి, రమణ, సురేష్, చంద్రరావు, అప్పలనాయుడు పట్టుబడ్డారన్నారు. వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. వారి నుంచి రూ.620 నగదు, ఐదు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనంతగిరిలో నేలకూలిన చెట్టు



నేలకూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

అనంతగిరి: మండలంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా, మధ్యాహ్నం నుంచి సుమారు మూడు గంటల పాటుగా భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అనంతగిరి సమీపంలోని అరకు–విశాఖ ప్రధాన రహదారిలో చెట్టు విరిగిపడడంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు సాయంతో చెట్టును తొలగించారు. అనంతరం రాకపోకలు సాగాయి.

మహిళలకు అండగా సీఎం జగన్



ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

దేవీపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మహిళా పక్షపాతి అని, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అండగా నిలుస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని ఇందుకూరుపేటలో సోమవారం వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ విడత ఆసరా సంబరాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. 321 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3,114 మంది సభ్యులకు రూ.1.27 కోట్ల చెక్కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకూ మూడు విడతల్లో రూ.60 కోట్లు మాఫీ అయినట్టు చెప్పారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి దాదాపు 5 వేల మంది మహిళలు ఎండను సైతం లెక్కచేయకుండా తరలివచ్చి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. సీఎం జగన్‌మోహనరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తమ హర్షధ్వానాలతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్లపట్టాల పంపిణీ

పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామమైన తాళ్లూరు నిర్వాసితులు 24 మందికి ఎమ్మెల్యే చేతులమీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ గ్రామానికి పెదభీంపల్లి వద్ద ఇప్పటికే పునరావాసం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, వైస్ ఎంపీపీలు నందూరి లక్ష్మీకుమారి, గారపాటి మురళీకృష్ణ, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో కె. రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబ్జి, సత్యనారాయణ, పెద్దబ్బాయిదొర, మట్ట రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

మారేడుమిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సోమవారం మారేడుమిల్లిలో స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మూడో విడత మంజూరు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో డ్వాక్రా సంఘాలకు రెండు కోట్ల యాభై లక్షల అప్పు ఉండగా, కోటి ఎనభై లక్షలు అప్పు తీర్చామన్నారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం అక్కచెల్లెమ్మల మొహంలో ఆనందం చూడాలనే సకల్పంతో వారి అప్పులు తీర్చుతున్నారన్నారు. మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వశక్తిగా ఎదగాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్కా మహిళకి లబ్ధి చేకూరలేదన్నారు. జగనన్న అధికారంలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు లబ్ధి పొందారని తెలిపారు. అనంతరం రూ. 57,22063 చెక్కును మహిళా సంఘాలను ఎమ్మెల్యే అందజేశారు. జగన్ చిత్రపటానికి మహిళలతో క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, కో– ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, వైస్ సర్పంచ్ వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, మండల సచివాలయ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబి), నాయకులు లింగారెడ్డి, దూడ స్మిత్, సునిల్ పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

మన్యంలో 'ఇటుకల పండగ'



దారిలో వాహనదారుల వద్ద తాసేరు వసూళ్లు చేస్తున్న మహిళలు



శంకుదేవుడి వద్ద పూజలు చేసిన విత్తనాలు అందిస్తున్న పూజారి

- ఏటా చైత్రమాసంలోనే నిర్వహణ
- నెల రోజుల పాటు గిరిజన గ్రామాల్లో సందడి
- విత్తు పండగతో ఆరంభం

పెదబయలు: మన్యంలో పండగలు గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను, ఐక్యతను చాటుతాయి. ఈ నేపథ్యంలో చైత్రమాసంలో ఇటుకల పండగ ఎంతో సందడిగా నిర్వహిస్తుంటారు. ఈ పండగ ప్రారంభం మొదటి వారంలో వ్యవసాయానికి సంబంధించి విత్తనాలు గ్రామ పోతురాజు, శంకుదేవుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామ పూజారి శంకుదేవుడి గుడి చుట్టూ విత్తనాలు చల్లిన తర్వాత, మిగిలినవి గ్రామంలో అన్ని ఇళ్లకు అందిస్తారు. ఆ తర్వాత పూజలు చేసిన విత్తనాలతో కలిపి వ్యవసాయానికి ఉపయోగిస్తారు. ఆ తర్వాత నుంచి ఇటుకల పండగ ప్రారంభమవుతుంది. మొదటి ఇంట్లో వ్యవసాయ పనిముట్లు, ఇతర సామగ్రికి పూజలు చేస్తారు. తాము పండించిన దానితో వండి ఇంట్లో దేవతలకు నైవేద్యంగా పెట్టిన తర్వాత మగవారు వేటకు బయలు దేరుతారు. ఈ పండగలో మహిళల సందడి ఎక్కువగా ఉంటోంది. గ్రామాల్లో ప్రతీ మగ వారు వేటకు వెళ్లి తీరాల్సిందే. వేటకు వెళ్లి జంతువులను వేటాడి తీసుకుని రాకపోతే పాటలు, మాటలతో హేళన చేస్తారు. రంగునీళ్లు పోసి గ్రామంలో ఉండకుండా అడవికి తరిమేస్తారు. గ్రామాల్లో మహిళలు గుంపుగా ఏర్పడి దారిలో వచ్చి పోయే వారికి తాసేరు(పజోర్) వసులు చేస్తారు. తాసేరు ఇవ్వని వారికి రంగు నీరు పోస్తారు. ఇలా వారం రోజుల పాటు జరుగుతుంది. ఎంతో ఉత్సాహంగా జరిగే ఈ పండగను గిరిజనులు ఎంతో ఉల్లాసంగా జరుపుకుంటారు. గ్రామాల్లో థింసా నృత్యాలు ఎక్కువగా కనిపిస్తోంది.

శంకుదేవుడే గ్రామ ఇలవేల్పు:

మన్యంలో ప్రతీ గ్రామంలో శంకుదేవుడిని కొలుస్తారు. పూజలు చేసి, దేవుడ్ని శాంతింపజేసిన తర్వాతనే పండగ మొదలెడతారు. అయితే పండగ జరిగేంత వరకు పూజారి రోజూ పూజలు చేస్తారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.

రెండు గంటల ముందు ప్రయాణం ఉత్తమం

ఇటుకల పండుగ సందర్భంగా తాసేరు(పజోర్) వసూళ్ల దారి పొడవునా ప్రతీ గ్రామంలో నాలుగు నుంచి ఎక్కువగా దర్శనమిస్తాయి. ప్రతీ పజోర్ గేటులో చిల్లర పైసలు వేయాల్సి ఉంటోంది. పజోర్ గేట్లు వల్ల అత్యవసర పనులు ఉంటే మాత్రం ఇబ్బంది పడే అవకాశం ఉంది. అత్యవసర ప్రయాణం ఉంటే మాత్రం రెండు గంటలు ముందుగాను బయలు దేరడం ఉత్తమం. గతేడాది ఇతర ప్రాంతాల నుంచి పరీక్షలు రాసే విద్యార్థులు పజోర్ గేట్లలో చిక్కుకుని సకాలంలో హాజరు కాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. పండుగ జరిగే నెల రోజులు కాస్తా ముందు జాగ్రత్త అవసరం.

పింఛన్ల సొమ్ము అప్పగింత

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి గ్రామ సచివాలయం–2 వలంటీరు బాలకృష్ణ వద్ద పింఛన్ల సొమ్మును సోమవారం ఎంపీడీవో లాలం సీతయ్యకు అందజేశారు.

వలంటీర్ పరిధిలోని పింఛన్లకు సంబంధించి రూ.32,250 లబ్ధిదారులకు అందజేయడంలో నిర్లక్ష్యం వహించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేయడంతో సొమ్ము తిరిగి చెల్లించాలని వలంటీర్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు నగదు స్వాధీనం చేసుకున్నారు.

బాక్సైట్ కేసులో సీపీఐ నాయకులకు విముక్తి



వివరాలు వెల్లడిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం(విశాఖ): ఉమ్మడి విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ నిక్షేపాలు వెలికితీయాలన్న గత టీడీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ సీపీఐ ఆందోళనలపై పోలీసులు పెట్టిన కేసును సోమవారం కోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా సీపీఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, డి.మార్కండేయులు, టి.వెంకటేశ్వరరావులు జిల్లా కోర్టు వద్ద మాట్లాడుతూ 2015 నవంబర్ 6న సీపీఐ ఆధ్వర్యంలో గత ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన నేపథ్యంలో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ చేపట్టిన రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కేవీఎల్ హిమబిందు కేసును కొట్టివేశారని వారు తెలిపారు. దీంతో ఈ కేసులో తమకు విముక్తి లభించిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఆనాడు బాక్సైట్ నిక్షేపాలు వెలికితీయాలన్న ప్రతిపాదనను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో పేదలకు భోజనాలు



భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్పీఎఫ్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఒక పక్క వారపు సంతకు, మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన 215 మందికి వీటిని అందించారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు పట్టివేత



పోలీసులు పట్టుకున్న గోవులు

నక్కపల్లి: విజయనగరం జిల్లా అలమండ నుంచి రాజమండ్రి అక్రమంగా తరలిస్తున్న గోవులను సోమవారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. జై శ్రీరామ్ జై గోమాత సంస్థ వారు గోవుల అక్రమ తరలింపుపై కొద్ది రోజులుగా నిఘా పెట్టారు. ఇటీవల కాలంలో పశువుల సంతల్లో కొనుగోలు చేసిన గోవులను రాజమండ్రి, హైదరాబాద్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ సంస్థ వారు ఇచ్చిన సమాచారం మేరకు నక్కపల్లి ఎస్‌ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కంటైనర్‌లో కుక్కి తరలిస్తున్న 17 ఆవులను గుర్తించారు. వెంటనే ఈ కంటైనర్‌ను ఆవులను స్వాధీనం చేసుకుని కొత్తవలస సమీపంలో ఉన్న గోశాలకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. గోవుల అక్రమ తరలింపుపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ప్రతిభావంతులకే ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

చింతపల్లి రూరల్: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా కమాండెంట్ సంజయ్‌కుమార్ ద్వివేది ఆధ్వర్యంలో గిరిజన పాఠశాలల్లో బాలబాలికలకు నోట్‌బుక్స్, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ గిరిజన విద్యార్థులు రాణించాలన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతిభావంతులైన వారికి మాత్రమే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని, భవిష్యత్ లక్ష్యాలను సాధించాలని సూచించారు. అసిస్టెంట్ కమాండెంట్ అరుణ్‌కుమార్, సీఆర్పీఎఫ్ సీఐ కీయాల్ షేక్, ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల కొట్లాట

యలమంచిలి : పాత కక్షలతో ఇరువర్గాల మధ్య కొట్లాట ఘటన మండలంలోని రామారాయుడుపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలో రామాలయం నిర్మాణం, భూ తగాదాల పరిష్కారం కోసం చర్చించేందుకు ఆదివారం రాత్రి గ్రామ పెద్దలు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి హాజరైన బెజవాడ వెంకట రమణ, బత్తిన సత్యనారాయణలు వాగ్వాదానికి దిగి ఆవేశంతో కొట్లటకు దిగారు. వారి మద్దతుదారులు కూడా ఘర్షణకు దిగి పరస్పరం కొట్టుకున్నారు. ఇరు వర్గాల వారు గాయపడడంతో వారిని గ్రామస్తులు యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇరువర్గాలకు చెందిన 10 మందిపై ఐపీసీ 324 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చెసినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ

- వెంకటరాజుపురం ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.5500 ఫైన్
- ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా అడిషనల్ పీడీ రోజారాణి

దేవరాపల్లి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ మండల ప్రజా వేదిక కార్యక్రమం సోమవారం పారదర్శకంగా జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజా వేదిక సమావేశంలో డ్వామా జిల్లా అడిషనల్ పీడీ ఎం.రోజారాణి, జిల్లా విజిలెన్స్ అధికారి (డీవీవో) సిహెచ్. నిర్మలాదేవి, మాడుగుల క్లస్టర్ ఏపీడీ బి. శ్రీనివాసరావు, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఏపీవో డి.చంద్రకళ తదితర అధికారులు పాల్గొన్నారు. 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31 వరకు మండలంలోని 27 పంచాయతీల్లో రూ. 9.31 కోట్ల వ్యయంతో 215 పనులు చేపట్టారు. చెరువులు, పంట కాలువల పూడికతీత పనులు, రోడ్లు, పంట పొలాలు అభివృద్ధి, పండ్ల తోటల పెంపకం, రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంపకం తదితర పనులకు సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్(ఎస్‌ఆర్‌పి) ఎం. నాగరాజు నేతృత్వంలో గ్రామాల్లో సామాజిక తనిఖీ జరిపారు. గ్రామస్థాయిలో గ్రామాల వారీగా గుర్తించిన లోటుపాట్లను సామాజిక తనిఖీ బృందం సభ్యులు మండల ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాల్లో గుర్తించిన చిన్న చిన్న లోపాలకు సంబంధించి సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తగు ఆధారాలను ప్రజావేదిక దృష్టికి తీసుకురావడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

వెంకటరాజుపురం గ్రామంలో ఉపాధి పనులకు హాజరైన కూలీల వేలిముద్రలు మస్టర్ షీట్‌పై వేయించక పోవడాన్ని గుర్తించారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యంగా పరిగణిస్తూ రూ. 5,500 అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో బి.కింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఎం.అలమండ, వెంకటరాజుపురం వేచలం, సర్పంచ్‌లు దాడి జగన్, దాసరి సంతోష్‌కుమార్, నాగిరెడ్డి శతారినాయుడు, ఉగ్రాకుల అప్పారావు, గొర్లె కొండలరావు, మజ్జి రాజు పాల్గొన్నారు.

రోగులకు అరకు ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



కేజీహెచ్ పిల్లల వార్డులో ఫాంగి వర్షితతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న అరకు నియోజకవర్గానికి చెందిన ఫాంగి వర్షితను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం పరామర్శించారు. అరకు ప్రాంతానికి చెందిన ఫాంగి వీరన్న(లేటు) కుమార్తె వర్షిత గుండెలో నీరు చేరడంతో ఆపరేషన్ కోసం కేజీహెచ్‌లో చేర్చారు. ఆమె వైద్యం కోసం వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం వర్షిత కుటుంబ సభ్యులు కొంత ఆర్థిక సహాయం అందించారు.

- ఇటీవల బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు గాయపడి విశాఖ పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరకు వ్యాలీ మండలం కొత్రగూడ గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్మ చంద్రమోహన్ దాస్(53)ను ఎమ్మెల్యే ఫాల్గుణ పరామర్శించారు. ఆస్పత్రిలో దాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దాస్ త్వరగా కొలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కిల్లో రాజారమేష్ బోస్, కుంతుర్ల పంచాయతీ సర్పంచ్ వంతాల చిన్నారావు, పెదబయలు మండల మాజీ వైస్ ఎంపీపీ వంతాల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొర్ర రాజారావు పాల్గొన్నారు.

తోటగోడిపుట్టుకు విరాళాల వెల్లువ



సీహెచ్‌డబ్ల్యూ జెమ్మకు సన్మానిస్తున్న దాతలు

ముంచంగిపుట్టు: జోలాపుట్టు పంచాయతీ తోటగోడిపుట్టు గ్రామానికి సీహెచ్‌డబ్ల్యూ తన జీతం డబ్బులు వెచ్చించి రహదారి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆ గ్రామానికి కొన్ని రోజులుగా దాతల విరాళాలు వెల్లివెత్తుతున్నాయి. సోమవారం వి.మాడుగులకు చెందిన అభిరుచి అకాడమీ అధ్యక్షుడు వి.ఎస్.బి.దేవవర్మ, ప్రతినిధులు దొర జగన్నాథం సీహెచ్‌డబ్ల్యూ జెమ్మ, ఆమె భర్త వెంకటరావులకు రూ.15 వేల విరాళం అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆమె సంకల్పం పలువురికి ఆదర్శమన్నారు. దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బేడీలతో పరారైన గంజాయి నిందితుడు సత్తిబాబును చెన్నైలో విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లిక్విడ్ గంజాయి కేసులో చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన సియాదుల సత్తిబాబు ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి శనివారం ఉదయం బేడీలతో పరారైన విషయం తెలిసిందే. ఈస్ట్ ఇన్‌చార్జ్ ఏసీపీ వివేకానంద ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్‌ఐ వెంకటరావు, కానిస్టేబుళ్ల బృందం నగరంలో జల్లెడ పట్టారు.

ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో లక్ష్మీపురంలో గాలింపు చర్యలు చేపట్టారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో చెన్నై ట్రైన్ ఎక్కినట్టు రైల్వేస్టేషన్‌లోని సీసీ పుటేజీల్లో రికార్డ్ కావడంతో ఆ మేరకు పోలీస్ బృందం బయలుదేరి వెళ్లింది. చెన్నైలో సీసీ పుటేజీల ఆధారంగా సత్తిబాబును అదుపులోకి తీసుకొని విశాఖ తీసుకొస్తున్నారు.

20 బస్తాల పీడీఎఫ్ బియ్యం పట్టివేత



పీడీఎఫ్ బియ్యంతో ఆటో

ఆరిలోవ(విశాఖ): పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ఆటోలో పీడీఎఫ్ బియ్యం పట్టుబడ్డాయి. నగరం నుంచి ఆరిలోవ వైపు వస్తున్న 'ఏపీ 39 ఎక్స్ 6265' నంబరు గల ఆటోను పోలీసులు ఆదివారం రాత్రి ఆపారు. ఆటో డ్రైవర్‌కు మద్యం పరీక్ష చేశారు. అనంతరం ఆటోలో ఏం తరలిస్తున్నాడో పరిశీలించారు. ఆటో అంతా పూర్తిగా కప్పేసిన కవర్లు తొలగించారు. దానిలో రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయి. ప్రభుత్వం సరఫరా చేసిన సంచుల్లోనే ఆ బియ్యాన్ని దొంగతనంగా బయట తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఆటోను ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందులో 20 బస్తాల బియ్యం ఉన్నట్టు గుర్తించారు. దీనిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు సీఐ సోమశేఖర్ తెలిపారు. ఆటో నడిపిన డ్రైవర్ తేజాపై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని సివిల్ సప్‌లై అధికారులకు అప్పగిస్తామన్నారు. నేరుగా రేషన్ డిపో నుంచే ఆ బియ్యాన్ని ఆటోలో దొంగతనంగా తరలిస్తున్నట్టు పోలీసులు భావిస్తున్నారు.

పోలీసులపై ఒత్తిడి..

ఆటోలో బియ్యం తరలించే వ్యక్తిపై కేసు నమోదు చేయవద్దంటూ టీడీపీ నాయకులు కొందరు పోలీసులుపై ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. అందుకే ఆదివారం రాత్రి ఆటో పట్టుబడితే సోమవారం రాత్రి వరకు కేసు చేయకుండా తాత్సారం చేసినట్టు తెలిసింది. సోమవారం రాత్రి వరకు పౌర సరఫరా విభాగం అధికారులుకు కూడా పోలీసులు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

డీఎస్సీ-98 అభ్యర్థులు అంగీకార పత్రాలు ఇవ్వాలి

విశాఖ విద్య: డీఎస్సీ–98 ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో 355 మంది ఎంపికైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఛీ్ఛౌటట ఇ ్ఛు వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఎంపికైన అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నంలోని డీఈవో కార్యాలయంలో మినిమం టైం స్కేల్ పనిచేస్తామని కాంట్రాక్టు అగ్రిమెంట్ ఇవ్వాలన్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

అల్లిపురం (విశాఖ దక్షిణ) : నలుగురు గంజాయి వ్యాపారులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 22 కేజీల గంజాయి, కారు, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సింహాద్రి హాస్పటల్ వద్ద గదిని అద్దెకు తీసుకుని గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు, మహారాణిపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిలా, ముంచంగిపుట్టుకు చెందిన కిల్లో ప్రసాదరావు, కిల్లో సురేష్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన సిద్దిక్ కోరా, బీహార్ రాష్ట్రం కద్దాపూర్‌కు చెందిన తారిక్ అన్వర్‌లను అరెస్ట్ చేశారు.